# ప్రకృతి కిరణం

(ఆంధ్రప్రభ వీక్లీ)

ప్రకృతి మనిషికి ఎన్నో వరాలిచ్చింది!
ఎన్నెన్నో ధర్మాలు నేర్పింది!
మాతృ ధర్మం విషయానికి వస్తే ప్రకృతి
లోని పక్షుల నుండి కూడా మనం నేర్చుకో
వలసినది ఎంతయినా వుందేమో ననిపి
స్తుంది!
తల్లి పక్షి పిల్లలకు ఆహారం అందించే
దృశ్యం ఎంతటి కమనీయమో!!!.....

"నేను వాల్వ్ తెరుస్తాను. నువ్వు పంపు స్టార్ట్ చెయ్. తరువాత ట్యాంక్ మీదకు వెళ్ళి ఏసిడ్ అందులో పడుతోందో లేదో చూడు" అన్నాడు రాజన్.

అలాగే నన్నట్లు తల పంకించి పంపు ఆన్ చేశాను.

పెద్ద శబ్దంతో యాసిడ్ పంపు పనిచేయడం ఆరంభించింది.

పంపు పై భాగంలోని పైపును చేతితో తాకి చూసేను.

త్వరితంగా వేడెక్కుతోంది.

అంటే ఏసిడ్ వెళ్తోందన్న మాట!

సందేహం లేదు.

దానిలో మిగిలిన వాల్వులు అన్నీ తెరిచి వున్నాయో లేదో మరో సారి చూసుకుని టాంకు మీదకు వెళ్ళేను.

రాజన వాల్వ్ తెరిచి మేడ మెట్లు ఎక్కి కంట్రోల్ రూమ్ వైపుకు సాగిపోయాడు.

టాంకు మీదకు వెళ్ళేసరికి యాసిడ్ పొగలు చుట్టుముట్టేయి.

ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరి అయినట్లయింది.

ఫాస్ఫారిక్ ఏసిడ్‌తో వచ్చిన చిక్కు ఇదే!

సల్ఫ్యూరిక్ ఏసిడ్‌కి మల్లే ఇది అంత ప్రమాదకరమైనది కాదు.

చల్లని ఏసిడ్ మీదపడినా కాలదు!

కానీ విపరీతమయిన పొగలు!

పొగ పీలిస్తే కళ్ళు మంటలు, ముక్కు మండిపోతుంది.

విపరీత మయిన తలనొప్పి వస్తుంది.

ముక్కు మీద వున్న మాస్కు సవరించుకుని, ఏసిడ్ పడుతున్న తొట్టె వైపుకు వెళ్ళేను.

గొట్టంలో నుండి దట్టంగా పడుతోంది.

అంటే, పంపు బాగా పనిచేస్తోందన్నమాట!

ఇక అక్కడ నిలబడలేక గబగబా కిందికి వచ్చేశాను.

అరగంటలో పంపింగ్ పూర్తి అయిపోయింది.

పంపు ఆపి, ముఖం కాళ్ళు చేతులు కడుక్కుని నా కేబిన్‌లోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

ఎదురుగా వున్న పానెల్ మీద వచ్చ దీపాలన్నీ విబ్బరంగా వెలుగుతున్నాయి.

పంపుల మీటర్లన్నీ ఒక్కసారి చూసుకుని, రీడింగులు అన్నీ లాగ్‌షీటులో ఎక్కించి సావధాన పడ్డాను.

కాబిన్‌లో కూర్చుని అవతలకు చూస్తే సాయంకాలపు దృశ్యం అతి మనోహరంగా కనిపిస్తోంది.

పగిలినట్లున్న సూర్యబింబం పశ్చిమాద్రిని చేరుకుంటోంది.

కుంకుమ ఒలకబోసినట్లు పశ్చిమ దిక్కు అరుణవర్ణం పులుము కుంటోంది.

కొంచెం ఆవలగా వున్న సల్ఫ్యూరిక్ ఆసిడ్ ప్లాంట్ పొగ గొట్టంలో నుండి పలుచని తెల్లని పొగలు లేచి గాలిలో వలయాలు తిరిగి పక్కలకు పరుచుకుంటున్నాయి.

పొగ గొట్టం వెనుక కనిపించే బాయిలర్ నుండి దట్టమయిన ఆవిరి బయటకు వచ్చి మబ్బు పింజలకుమల్లే విడిపోతోంది. కొండల మధ్యకు జారిపోతున్న సూర్యబింబం పొగల మధ్య నుండి చూస్తే మరిన్ని సోయగాలు సంతరించుకుని దర్శన మిస్తోంది.

కాస్త అవతలగా కన్వేయరు చెట్టుమీద, పచ్చని పసిడిముద్దలా మెరుస్తున్న గంధకం మెల్లగా కదిలి గోడవున్ వైపుకు సాగిపోతోంది.

దూరంగా ప్రకృతి సౌందర్యాన్ని ఆకళించుకున్న తాటితోపు మెడలు సాచి నిటారుగా ఆకాశంలోకి తొంగి చూస్తున్నాయి.

ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తూ వుంటే గొప్ప చిత్రకారుడు గీసిన మహత్తరమయిన చిత్రాన్ని దర్శిస్తున్న అనుభూతి కలుగుతోంది.

ఫోను వచ్చిన సూచనగా కేబిన్‌లో ఎర్రదీపం వెలిగింది.

ఫోను అందుకుని రాజన్‌తో మాట్లాడేను.

అతనికి కావల్సిన వివరాలన్నీ అందజేశాను

అంతలో అద్దం అవతలివైపున వున్న పైపులైను మీద ఒక పక్షి వచ్చి వాలింది.

అందంగా తోక ఆడిస్తూ-

కళ్ళు చకచకా ఇటూ అటూ తిప్పుతూ-

పరిసరాలు పరికిస్తోంది.

వింత వింత రంగుల ఈకలతో ఎంతో అందంగా వుంది అది.

తల మీద చిన్న పించం లేత నీలం రంగులో రెపరెప లాడుతోంది.

ఆ పక్షి ముక్కున ఒక కర్రపుడక కరచుకుని వుంది.

లైను మీద నిలబడి తోక ఆడించే సమయంలో ముక్కునవున్న పుడక కాస్తా నేలమీద పడిపోయింది.

పడిపోయిన పుల్లవంకే రెండు క్షణాలు దృష్టి నిలిపి చూసింది.

నేను విస్మయంతో దానివంకే చూస్తున్నాను.

సాధారణంగా కెమికల్ ప్లాంటులోనికి పక్షులు రావు.

విపరీతమయిన పొగలు, భరించలేని ఘాటయిన వాసన అందుకు కొంత కారణాలు.

కానీ, దాని ముక్కున కరచుకు వచ్చిన పుల్లను చూస్తుంటే అది ఈ పరిసరాల్లో ఎక్కడో గూడు కడుతున్నట్లు అనిపించింది.

రెండు క్షణాలు తోకాడిస్తూ, చెంగు చెంగున పైపులైనుమీద ఇటూ అటూ గెంతింది. తరువాత రివ్వున రెక్కలు ఆడిస్తూ కిందకు దుమికి నేలనున్న పుడకను ముక్కున కరచుకొని వేగంగా ఎగిరి కాస్త దూరంలో వున్న మరో గొట్టంమీద వాలింది.

ఎందుకో దానిని గమనించాలనే ఆసక్తి నాలో పెరిగింది.

మెల్లగా కేబిను తలుపులు తెరచుకొని బయటకు వచ్చేను. నా ఊహ నిజమయింది.

ఆ పక్షి వాలిన వైపు క్రింది భాగంలో-

ఎలక్ట్రిక్ కేబుల్ ట్రేమీద గూడు కన్పించింది.

అప్పుడే గూడు అంతా పూర్తయిపోయింది.

తాను తెచ్చిన పుల్లకూడా గూటిలో ఒక వారగా వుంచింది.

అంతలోనే పుల్లల మధ్యకు దూరి మాయమైపోయింది.

నాకు ఆ పక్షి చర్యల ఎడల ఆత్రుత పెరిగింది.

గూడు దగ్గరగా చూడాలనే కాంక్ష అధికమయింది.

కాస్త ఎడంగావున్న ఇనుప నిచ్చెన సహాయంతో ఎక్కి పైకి వెళ్ళాను.

నా అలికిడి వినగానే గూటినుండి పక్షి బయటకు వచ్చింది.

తుర్రున ఎగిరి పారిపోయింది.

కాస్త ఎడంగా నిలబడి గూటివంక చూసేను.

ఏ ఇంజనీరింగ్ సూత్రాలకూ అందని రహస్యం ప్రకృతి నేర్పుతుంది కాబోలు!

లేకపోదే అంత చక్కగా ఇల్లు నిర్మించుకోవటం పక్షులకు ఎలా సాధ్యం ?!

పుల్లలన్నీ చక్కగా పేర్చి వున్నాయి.

ఎవరో సక్రమమయిన ధోరణిలో అందంగా తీర్చిదిద్దినట్లుంది ఆ గూడు! పుల్లలు బాగా ఎత్తువరకూ జోడించి మధ్యలో చాలా విశాలమయిన చోటు వచ్చేలా ఏర్పాటు చేసుకుంది.

దూది, చిత్రిక వంటి మెత్తని వస్తువులు ఎన్నో ఆ గూటిలో చేర్చింది.

అందులోనే గూటిలో కొంత కదలిక కన్పించింది.

కదలికతోబాటు సన్నని సవ్వడికూడా విన్పించింది.

ఆశ్చర్యంతో మరికాస్త చేరువగా చేరి నిశ్శబ్దంగా తొంగిచూశాను.

గూడు బాగా లోతుకు వుంది.

మధ్యలో తల్లిపక్షి, రెండు పిల్లలు వున్నాయి.

తల్లి పక్షికి మగదానికిమల్లే తలపై పింఛంలేదు.

పిల్లలకు ఇంకా కళ్ళుకూడా విడినట్లు లేదు.

మెడలెత్తి తడుముతూ తల్లి చేరువలో కువకువలాడుతున్నాయి.

తల్లిపక్షి సుతారంగా తన ముక్కుతో వాటి మెడలమీద రాస్తోంది.

రెండు నిమిషాలు వాటివంక చూసి క్రిందకు దిగిపోయాను.

నేను చూసినట్లు పోలిస్తే తల్లిపక్షి భయపడి గూడు మార్చేస్తుందని జాలికల్గింది.

వాటిని బెదరించటం ఇష్టంలేక దూరంగా వచ్చేశాను.

ఆ గూటిమీదుగా సల్ఫ్యూరిక్ ఆసిడ్ లైను వెళుతోంది.

ఆ గొట్టం ఎప్పుడూ వేడిగానే వుంటుంది.

ఆ వెచ్చదనం కోసం అవి అక్కడ గూడు కట్టుకున్నాయి కాబోలు!

అయితే అంతలోనే ఒక భయంకరమయిన ఆలోచన నా మెదడు లోనికి వచ్చింది.

సరిగ్గా, గూటి పైభాగంలో లైనుమీద జాయింటు వుంది.

నెలకు ఒకటి రెండు సార్లయినా ఆ జాయింటు పగిలిపోతూ వుంటుంది. అది పగిలితే ఏసిడ్ పైకి పడిపోతూ వుంటుంది.

ఈసారి అది పగిలితే ? !

సరిగ్గా గూటిలో పడుతుంది ఏసిడ్!

ఏసిడ్ పడితే చాలు-పక్షిపిల్లలు మాడిపోతాయి!

ఇక ఆలోచించలేకపోయాను.

పోనీ, వాటిని అక్కడనుండి తరిమేద్దామా? అని కూడా అన్పించింది.

తరిమేస్తే కళ్ళువిడని ఆ పక్షిపిల్లలు కాకులకో, గద్దలకో చిక్కటం ఖాయం.

వాటి మానాన వాటిని వదిలివేయటమే ఉత్తమంగా అన్పించింది.

ఈ ఆలోచనల మధ్య వుండగా రాజన్ కంట్రోలు రూమునుండి కిందకు వచ్చాడు.

అతని ముఖం పాలిపోయి వుంది.

నేను ఏదో అడగబోయేలోపున విషంలాటి వార్త వినిపించేడు.

'మన వినయ్ మనకిక లేడు!' అన్నాడు బొంగురు గొంతుతో.

నేను షాక్ తిన్నట్లయ్యాను.

ఆ ముందురోజే మా మిత్రుడు వినయ్‌కి కడుపులో నెప్పి విపరీతంగా వస్తే హాస్పిటల్‌లో చేర్చాం.

ఎపెండిసైటిస్ అన్నారు డాక్టర్లు!

ఈ ఉదయం ఆపరేషన్ కూడా చేశారు.

అయినా ఫలితం దక్కలేదన్నమాట!

నిన్నటివరకూ మా మధ్య తిరుగుతూ, మాతోబాటు పని చేసిన వినయ్ మరి లేడన్న విషయం నమ్మలేనిదయినా, సత్యదూరం మటుకు కాదు.

మరొకసారి హాస్పిటల్‌కు ఫోన్‌చేసి, వాస్తవాన్ని ధృవపరచు కున్నాం.

అతడి ఆత్మశాంతికి రెండు నిమిషాలు అందరం మౌనం పాటించేం.

డ్యూటీనుండి ఇంటికి వెళ్ళేటప్పుడు హాస్పిటల్‌కు వెళ్ళి వినయ్ భౌతిక కాయాన్ని కడసారిగా చూసి రెండు కన్నీటిబొట్లు విడిచేం.

అతని శవం ప్రక్కన కూర్చుని. దీనంగా రోదిస్తున్న అతని భార్యను చూస్తే నా హృదయం తరుక్కుపోయింది.

ఇంకా మూడు పదుల వయసయినా నిండని ఆమెకు తీరని కష్టం వచ్చింది.

అయిదేళ్ళ లోపు వయసులోవున్న పిల్లలిద్దరినీ తండ్రి కాళ్ళ దగ్గర పడేసి, చీరకొంగు నోట్లో కుక్కుకుని అతిదీనంగా విలపిస్తోంది.

ఏ దేవుడూ ఆమె మొర ఆలకించడని తెలిసినా-

పోయిన భర్తను తిరిగి ఇమ్మని అందరి దేవుళ్ళకూ మొక్కు తోంది.

ఆ దృశ్యం మరి చూడలేక పైకి వచ్చేశాను!

బయట వరండాలోనికి వచ్చేక రాజన్ అన్నాడు. "వినయ్‌కి వెనక ఆస్తి ఏమీలేదు. జీతంకూడా పెద్దగా వెనకెయ్యలేదు. ఉన్న అయిదారు వందలూ ఇప్పుడు ఖర్చులకే సరిపోతాయి. అవిడ ఆ పిల్లల్ని ఎలా పోషిస్తుందో?"

మా మిత్రులు అందరం కలిసి ఆర్థికంగా ఆమెకు కొంత సహాయం అందజేస్తే బాగుంటుందనే నిశ్చయానికి వచ్చేం.

ఆమె పైన చాలా పెద్ద భారాన్నే మోపిపోయాడు వినయ్ ! !

* * *

వారం రోజులు గడిచిపోయాయి.

యంత్రాలమధ్య యంత్రాలమై తిరుగుతూ—

వినయ్‌ను గురించిన జ్ఞాపకాలను అప్పుడే దూరం చేసుకుంటున్నాం.

సముద్ర ఘోషలాటి పంపుల శబ్దాలు మిగిలిన దైనందిన జ్ఞాపకాలు నుండి తరిమి, బాధ్యతలమధ్య కట్టిపడేస్తున్నాయి.

ఏ భోజనాల సమయంలోనో మా మధ్య ఒకే కారియర్ తక్కువయితే-

ఒక కుర్చీ ఖాళీగా వుండిపోతే-

ఆ సమయంలో మెరుపులా మెదుల్తున్నాడు వినయ్!

చిరునవ్వుతో వెలిగిపోయే అతని ముఖం, కాంతివంతమయిన అతని కళ్లు మా ఎదుట నిలుస్తున్నాయి.

అంతే!

తర్వాత అంతా మళ్ళీ మామూలే!!

ఆ సాయంకాలం పంపులన్నీ చెక్ చేసుకుని, నా కేబిన్‌లోనికి వెళ్ళబోతున్నాను. అంతలోనే పంపులహోరును చీలుస్తూ, 'కేర్' మంటూ అరుపు విన్పించింది.

చటుక్కున తలఎత్తి చుట్టూ చూశాను.

అప్రయత్నంగా నా చూపు సల్ఫ్యూరిక్ ఆసిడ్ లైను పైపుకు వెళ్ళింది.

నేను అనుకున్నంతా అయింది!

ఘోరం జరిగిపోయింది!!

సరిగ్గా పక్షి గూటిమీది జాయింటు పగిలిపోయింది.

పెద్ద ధారగా ఏసిడ్ గూట్లో పడుతోంది.

నాకు క్షణంసేపు ఏంచేయాలో తోచలేదు.

ఏసిడ్ ధార ఆగకపోతే పక్షులు చావటం ఖాయం. పెద్దవి రెండూ తప్పించుకోగల్గినా, పిల్లలుమాత్రం బలి అయిపోతాయి.

అంతలోనే ఏదో స్ఫురించినట్లయింది.

పరుగున వెళ్ళి ఆ గొట్టంలోకి ఏసిడ్ నింపే పంపు ఆపేశాను.

ధార ఆగిపోయినా సన్నగా చుక్కలుగా ఇంకా ఏసిడ్‌మాత్రం పడుతోంది.

గబ గబా ఇనప నిచ్చెన ఎక్కి పైకి వెళ్ళేను.

గూటిలోని దృశ్యం చూసి స్తంభీభూతుడనయ్యాను!

ఏదో మహత్తరమయిన దృశ్యాన్ని చూస్తున్నట్లు మెదడు కొన్ని క్షణాల సేపు ఆలోచనలకు దూరమయింది.

మగపక్షి తన రెక్కలను విసనకర్రలా విప్పి మిగిలిన వాటిమీద ఏసిడ్ పడకుండా గొడుగులా పట్టింది.

ఎంతో సుకుమారంగా వున్న దాని రెక్కలమీద ఏసిడ్ పడి, నున్నని ఈకల పైనుండి కిందకు జారిపోతోంది.

అప్పటికే కొంత ఏసిడ్ దాని మెడలమీద కూడా పడింది.

ఆ బాధను భరించలేక, విలవిల్లాడుతూ అరుస్తోంది అది.

తల్లిపక్షి ఒక పిల్లను ముక్కున కరచుకుని వెళ్ళి, కాస్త ఆవలగా వున్న వేపచెట్టు తొర్రలో ఉంచి మళ్ళీ రివ్వున వచ్చింది. ఈలోగా రెండో పిల్లను కరుచుకొని మగపక్షి ఎగరడానికి ప్రయత్నించి విఫలమయి గూటిలోనే పడిపోయి రెక్కలు తపతప కొట్టుకుంటూ దీనంగా అరుస్తోంది.

తల్లిపక్షి అంతలోనే వచ్చి రెండో పిల్లను కూడా ముక్కున కరచుకొని రివ్వున పారిపోయింది.

అ దృశ్యం చూస్తూ నిచ్చెనమీద కొంతసేపు అలాగే వుండిపోయాను.

మగపక్షిది ఎంత గొప్ప త్యాగం?

స్వార్థానికి ఇసుమంతయినా తావులేని భావన!

కొంతసేపు గూటిలోనే ఇటూ అటూ తపతపలాడుతూ కొట్టుకుంది

ఎగరలేక కిందకు మళ్ళీ పడిపోతోంది.

ఆఖరుసారి ఎగిరే ప్రయత్నంలో నేలమీద పడిపోయింది.

గబగబా నిచ్చెన దిగేను.

పక్షి దగ్గరకు వెళ్ళి ఇటూ అటూ దాన్ని కదిలించే ప్రయత్నం చేశాను.

దాని మెడకింది భాగం రెక్కలు అప్పటికే బాగా కాలిపోయాయి.

దగ్గరున్న నీళ్ళ గొట్టంతో పక్షిమీద నీళ్ళు చల్లేను.

దానికి బాధోపశమనం చేయటం తప్ప నేను చల్లే నీళ్లు ఎందుకూ పనికిరావని నాకు తెలుసు.

అప్పటికే అది ఏసిడ్‌తో బాగా తడిసిపోయింది.

నేను దగ్గరకు వెళ్ళినపుడల్లా మరింత బెదిరిపోయి ఎగిరే ప్రయత్నంచేసి కింద పడిపోతోంది.

దానికున్న బాధతోబాటు నేను అపకారం చేస్తానేమోనన్న భయం కూడా దానికి తోడయినట్టుంది.

ఎగరటానికి ఇంకా ఎక్కువ శక్తితో ప్రయత్నాలు సాగిస్తోంది.

దానికి దగ్గరగా వెళ్ళటానికి నాకు మనస్కరించలేదు.

కొంతసేపు బాధతో విలవిల్లాడి ప్రాణం విడిచింది అది.

అంతలోనే అక్కడికి ఆడపక్షి వచ్చింది.

దానికి పరిస్థితి అర్థమయిపోయినట్లుంది.

వెల్లకిలాపడి కళ్లు తేలవేసివున్న మగపక్షి చుట్టూ 'క్రీ' 'క్రీ' మని అరుస్తూ చాలాసేపు తిరిగింది.

దాని కళ్ళల్లో నీళ్లు తిరిగాయా?

ఏమో? !!

నేను చెప్పలేను!

కాని, దాని రోదన వింటూంటే హఠాత్తుగా వినయ్ భార్య గుర్తుకు వచ్చింది.

హాస్పిటల్లో ఆనాడు చూసిన దృశ్యం మళ్ళీ కనుల ముందు తిరిగింది.

చాలా సేపు అరిచి అరిచి వెళ్ళిపోయింది ఆడపక్షి.

మనసంతా కలచివేసి నట్లయింది!

మెల్లగా కాబిన్‌లోకి వెళ్ళి తలుపేసుకున్నాను.

*　　　*　　　*

ఆ మరుసటిరోజు మధ్యాహ్నం-

డ్యూటీకి వచ్చేసరికి పిడుగులాటి వార్త తెలిసింది!

వినయ్ భార్య పసికందు లిద్దరినీ వదలి ఆత్మహత్య చేసుకుందట! రాత్రి నిద్రమాత్రలు ఎక్కువ మోతాదులో మింగి చనిపోయిందట! 'తన పిల్లలిద్దరినీ పెంచి, పెద్దచేసే సామర్థ్యం తనకు లేదనీ, వాళ్ళను దీన మయిన స్థితిలో తాను చూడలేననీ' ఉత్తరం రాసిపెట్టి మరీ చనిపోయింది!

నా మనసంతా అదోలా అయిపోయింది!

ఆలోచించిన కొద్దీ వినయ్ భార్య ఆత్మహత్యను నా మనసు సమర్థించలేక పోతోంది.

వినయ్ భార్య చదువుకున్నదే!

ఇంతో అంతో లోకజ్ఞానం తెలిసిన మనిషే!

ఆమె ప్రయత్నిస్తే ఏ చిన్న ఉద్యోగమయినా సంపాదించటం ఏమంత కష్టంకాదు.

ఆ పిల్లల్ని పెంచి పెద్దచేయటం కష్టమే అయినా దుస్సాధ్యం మాత్రం కాదు.

ఇప్పుడు ఆ పసికందు లిద్దరూ అనాథలయిపోలేదూ?

వాళ్ళకి దిక్కెవరు?

చనిపోయిన ఆత్మలు పైన తిరుగాడుతూ వుండటమే నిజమయితే, ఆ అనాథపిల్లల ఆర్తనాదాలతో ఆమె ఆత్మ క్షోభించదూ?

సమస్యకు కొనితెచ్చుకున్న చాలే పరిష్కారమా ???

వినయ్ భార్య ఘోరమయిన తప్పు చేసింది.

వినయ్ పిల్లల భవిష్యత్తు గురించి రాజన్ మిగిలిన మిత్రులతో చర్చిస్తున్నాడు.

నేను మౌనంగా కంట్రోలు రూం వదలి, మేడమెట్లు దిగి కిందికి వచ్చాను.

తలఎత్తి పైకి చూస్తే, ఏసిడ్‌తో తడిసి నల్లబడిపోయిన పుడకల గూడు-సగం కాలి ఆరిపోయిన చితి తాలూకు చిహ్నంలా కనిపించింది.

అంతలోనే పక్షిపిల్లలు జ్ఞాపకానికి వచ్చేయి.

ఇంకోవైపు అనాథలయిన వినయ్ పిల్లలు కళ్ళముందు కదిలేరు.

వినయ్ భార్యకు మల్లే తల్లిపక్షి వాటికి అన్యాయం చేసిపోయిందా?

పక్షి పిల్లల్ని గురించిన ఆత్రుత పెరిగింది.

మెల్లగా వేపచెట్టు వద్దకు వెళ్ళేను.

శబ్దం చేయకుండా చెట్టు ఎక్కి తొర్రవంకకు చూసేను.

పక్షిపిల్లలు రెండూ అందులో వున్నాయి.

అవి కాస్త ఎదిగేయి!

కువకువలాడుతూ రెక్కలు కొట్టుకుంటూ ఇటూ అటూ గెంతుతున్నాయి.

అంతలోనే ఎక్కడినుండో ఎగిరి వచ్చింది తల్లిపక్షి.

తన నోట కరచుకు వచ్చిన పురుగులను తమాషాగా పిల్లల నోటికి అందిస్తోంది.

లక్కపిడతల్లాటి, ఎర్రటి, బుల్లినోళ్లు తెరుచుకుని పిల్లలు వాటిని ఆరగిస్తున్నాయి.

మనసు నిర్వచించలేని తృప్తితో నిండిపోయింది.

ఆ దృశ్యం చూస్తూ కొంతసేపు అలాగే వుండిపోయాను!